ప్రజాశక్తి
మంగళవారం 17 సెప్టెంబర్ 2024 5 కర్నూలు



ఫీజు పరేషాన్..!

- అగమ్యగోచరంగా విద్యార్థుల పరిస్థితి
- గతేడాది మూడు విడతల ఫీజు పెండింగ్
- ఈ ఏడాది విడుదలపై స్పష్టత కరువు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఇంజనీరింగ్, డిగ్రీ, ఫార్మసీ, పాలిటెక్నిక్ వంటి కోర్సులు చదువుతున్న విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత ప్రభుత్వం చేసిన నిర్వాకం, అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరికి విద్యార్థులు బలిపశువులుగా మారుతున్న పరిస్థితి నెలకొంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము చెల్లింపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో యాజమాన్యాల నుంచి విద్యార్థులు తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ఫీజులు చెల్లించాల్సిందేనంటూ యాజమాన్యాలు ఒత్తిడి చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు చెల్లించలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 50 వేల మందికి పైగా విద్యార్థులు ఇంజినీరింగ్, డిగ్రీ, ఫార్మసీ, పాలిటెక్నిక్ వంటి కోర్సులను అభ్యసిస్తున్నారు. ఇంజనీరింగ్ విద్యలో కాలేజీలో వసతులను బట్టి రూ.43 వేల నుంచి రూ.లక్షా ఐదువేల వరకూ ట్యూషన్ ఫీజు వసూలు చేస్తున్నాయి. హాస్టల్ ఫీజు కింద మరో రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకూ కాలేజీలు వసూలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నమ్ముకుని ఎంతో మంది పేద విద్యార్థులు ఇంజినీరింగ్ వంటి కోర్సులను అభ్యసిస్తున్నారు. గత ప్రభుత్వం విద్యాదీవెన పేరుతో ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ములను ఏడాదిలో నాలుగు విడతలుగా చెల్లించేది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేవలం ఒక్క విడత మాత్రమే విద్యార్థుల ఖాతాల్లో వేసింది. రూ.64 వేలు ఫీజు చెల్లించాల్సిన విద్యార్థికి రూ.16 వేలు మాత్రమే జమచేసింది. ఇంకా రూ.48 వేల ఫీజు అప్పటి వైసిపి ప్రభుత్వం చెల్లించలేదు. ఎన్నికల్లో టిడిపి కూటమి గెలిచింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ములు జమకు సంబంధించి ఇప్పటి వరకూ ప్రభుత్వం ఎటువంటి ప్రకటనా చేయలేదు. గత ఏడాది ఫీజు లేదు. ఈ ఏడాది ఫీజుపై స్పష్టత కరువైంది. గత ఏడాదికి సంబంధించి పూర్తి ఫీజు చెల్లిస్తే తప్ప రెండో సెమిస్టర్ పరీక్షలు రాయడానికి కాలేజీ యాజమాన్యాలు ఒప్పుకోలేదు. దీంతో తల్లిదండ్రులు అప్పులు చేసి గతేడాది ఫీజులు చెల్లించారు. ప్రభుత్వం ఆ సొమ్ములు వేస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తరగతులు ప్రారంభం కావడమే కాకుండా, మిడ్ పరీక్షలు సైతం కొనసాగుతున్నాయి. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి మొదటి విడత ఫీజు చెల్లించాలంటూ కాలేజీ యాజమాన్యాల నుంచి విద్యార్థులపై ఒత్తిడి మొదలైంది. దీంతో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. గతేడాది ఫీజుల కోసం చేసిన అప్పులు అలానే ఉన్నాయి. ఈ ఏడాది ఫీజుల పరిస్థితి ఏంటన్న బెంగ తల్లిదండ్రులను వెంటాడుతోంది. ఉన్నత విద్యాశాఖ మంత్రిగా ముఖ్యమంత్రి తనయుడు నారా లోకేష్ ఉన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులపై స్పష్టత ఇవ్వాలని విద్యార్థులు కోరుతున్నారు. ఇక నుంచి ఫీజు సొమ్ములు కాలేజీ యాజమాన్యాల ఖాతాలో వేస్తామని కూటమి ప్రభుత్వం ప్రాథమికంగా చెప్పిన పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది మొదటి విడత ఫీజు ఎప్పటిలోగా వేస్తారో ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని విద్యార్థులు కోరుతున్నారు. కాలేజీ యాజమాన్యాల నుంచి ఒత్తిడి లేకుండా చేయాలని అడుగుతున్నారు. అంతేకాకుండా గతేడాది పెండింగ్ ఫీజును వెంటనే విడుదల చేయాలని వేడుకుంటున్నారు. విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్న ప్రశ్న అందరినీ వెంటాడుతోంది. హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు గత ప్రభుత్వం వసతి దీవెన పేరుతో రెండు విడతలుగా ఏడాదికి రూ.20 వేలు ఇచ్చేది. గత విద్యాసంవత్సరానికి సంబంధించి వసతి దీవెన సొమ్ములు వైసిపి ప్రభుత్వం ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం హాస్టల్ ఫీజుల సొమ్ముల చెల్లింపుపై స్పష్టత ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



రేషన్ షాపులపై కన్ను

- కొత్తగా 300 పైగా రేషన్ షాపులు?
- రాత పరీక్ష,ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక
- పౌరసరఫరాల శాఖ నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కొత్త రేషన్ డీలర్ షాపుల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. కొత్తగా మంజూరయ్యే రేషన్ షాపులను దక్కించుకునేందుకు కూటమినేతలు ఇప్పటినుండే ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకుని వెళ్తున్నారు. ఎలాగైనా రేషన్ షాపులను దక్కించుకునేందుకు గ్రామస్థాయిలోని నేతలు ప్రజాప్రతినిధులకు సిఫార్సు చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో మొత్తం రేషన్ షాపులు 1233 దాకా ఉన్నాయి. ఈ రేషన్ షాపుల్లో దాదాపుగా 6,76,209 తెల్ల కార్డులు ఉన్నాయి. ఇటీవల ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం 2700రేషన్ డీలర్ షాపులను పెంచేందుకు నిర్ణయం తీసుకుంది. మన జిల్లాలో దాదాపుగా 200 నుండి 300 కు పైగా రేషన్ షాపులు పెరగనున్నట్లు పౌరసరఫరా శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం కార్డుదారులకు నిత్యవసర సరుకులు ఎండియు వాహనాల ద్వారా పంపిణీ చేస్తున్నారు. ఈ వాహనాల నుండి నిత్యవసర సరుకులు పంపిణీ నిలిపి వేసేందుకు కూడా ప్రభుత్వం సన్నద్ధమైంది. ఈ మేరకు రేషన్ డీలర్ షాపులను దక్కించుకునేందుకు ఇప్పటినుండే కూటమికి చెందిన నేతలు తమదైన రీతిలో పావులను కదుపుతున్నారు. ఈ రేషన్ డీలర్ షాపులను ఆశిస్తున్నటువంటి ఆశావాహులు ఇప్పటికే ప్రజాప్రతినిధులను కలిసి విన్నవించుకుంటున్నారు. కొత్త రేషన్ షాపులు ఎలాగైన కైవసం చేసుకునేలా దృష్టి సారిస్తున్నారు.

రేషన్ షాపుల పెంపు దిశగా చర్యలు

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ కొత్త రేషన్ షాపుల మంజూరు గాను ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం ఈనెల 30న రేషన్ షాపుల పునర్వ్యవస్థీకరణ ప్రారంభమవుతుంది. అక్టోబర్ 8వ తేదీ నాటికి కొత్త రేషన్ షాపుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయనున్నారు.అక్టోబర్ 22న నాటికి రేషన్ షాపులకు రోస్టర్ ప్రకారం కేటాయిస్తారు. 24న నోటిఫికేషన్ విడుదల చేస్తారు. నవంబర్ 7న రేషన్ డీలర్ షాప్ పోస్టులకు అర్హత పరీక్ష నిర్వహించిన అనంతరం 12వ తేదీన ఇంటర్వ్యూలను నిర్వహిస్తారు. నవంబర్ 16న రేషన్ డీలర్ నియామక ఉత్తర్వులను జారీచేస్తారు. ఎంపికైన రేషన్ డీలర్లకు వెంటనే ఈ పాస్ యంత్రాలను కూడా అందజేస్తారు. డిసెంబర్ 1 నుండి కొత్త రేషన్ షాపుల ద్వారా పంపిణీ ప్రక్రియను ప్రారంభిస్తారు.



మాట్లాడుతున్న నాయకులు

మహోన్నతుడు మహ్మద్ ప్రవక్త

- మిలాదున్ నబీ వేడుకలో వక్తలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విశ్వకారుణ్యమూర్తి, మహోన్నతుడు మహమ్మద్ ప్రవక్త అని వరంగల్‌కు చెందిన ఆల్ ఇండియా రేడియో వ్యాఖ్యత మగ్దూమ్ మొహిద్దిన్ అన్నారు. ఆదివారం లతీఫ్ లావు బాలే దర్గా నుండి మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ బయలుదేరి రాజు విహార్ సెంటర్ లోని హజరత్ సయ్యద్ జుల్ఫిషా వలి దర్గా చేరుకొని బహిరంగ సభ నిర్వహించారు. సెంట్రల్ మిలాద్ కమిటీ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా హజరత్ సయ్యదషా అబ్దుల్లా హుస్సేన్ బాద్షా ఖాద్రీ సాహెబ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సయ్యద్ షఫీ పాషాఖాద్రి సాహెబ్ పర్యవేక్షించారు. మగ్దూం మొహిద్దీన్ మాట్లాడుతూ తాను అన్ని ధార్మిక కార్యక్రమాల్లో కుల మతాలకతీతంగా ప్రసంగాలు చేస్తానని చెప్పారు. మన విశ్వానికి చివరి ప్రవక్తగా మహమ్మద్ వచ్చిన సమయంలో జూదం, వ్యభిచారం, సతీసహగమనం ఆడపిల్లలను చంపడం లాంటి అమానుషమైన చర్యలు జరుగుతున్న సందర్భంలో నిజమైన మార్గంలో నడిపించేందుకు మహమ్మద్ ప్రవక్త వచ్చారని అన్నారు. మహిళలను మర్యాదగా చూసినప్పుడే హజ్ చేసినా పుణ్యం లభిస్తుందని అన్నారు. మద్యపానం వల్లనే నేరాలు పెరుగుతున్నాయని అన్నారు. ఇస్లాం మతం పొరుగు వారిని ప్రేమించు ఆచరించి నడిచినప్పుడే మహమ్మద్ ప్రవక్త ఆశయాలను నెరవేర్చిన వారమవుతా ఉన్నారు. ఇస్లాం మతం ప్రయోగాత్మకమైనదని అన్నారు. పొరుగులో పేదవారిని కూడా చూసి వారి బాధల్లో పాలుపంచుకున్నప్పుడే మహమ్మద్ ప్రవక్త ఆశ నెరవేరినట్లని అన్నారు. మహమ్మద్ ప్రవక్త అన్ని ధర్మాలను ప్రేమించాలని అన్నారు. ఆయన 40 సంవత్సరాల వితంతు ఖతిజాను వివాహం చేసుకున్న మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త చెప్పిన మాటలను ఆచరించినట్లయితే హిందూ ముస్లింలు ఐకమత్యంగా ఉంటూ సోదర భావంతో మెలుగుతారన్నారు. అందరి పట్ల ప్రేమ దయ కలిగి ఉండాలని ఇతరులను గౌరవించాలని చెప్పారు. నగర మేయర్ బివై రామయ్య మాట్లాడుతూ మగ్గం మొహిద్దిన్ ప్రసంగం మనసుకు హత్తుకునే విధంగా ఉందని, సమాజంలో మార్పు కోసం ఎలాంటి వ్యక్తుల ప్రసంగాలు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ ముందుగా ముస్లిం సోదరులందరికీ మీలాద్ ఉన్ నబి శుభాకాంక్షలు తెలిపారు. స్వర్గం తల్లి పాదాల దగ్గర ఉందని ,తండ్రి తలుపులు దగ్గర ఉంటారని తల్లిదండ్రులను ప్రేమించి ప్రేమతో చూడాలని తెలిపారు. అందరూ ఐకమత్యంగా ఉండాలని సూచించారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త దశాదిశా నిర్దేశం చేసిన వ్యక్తి ప్రతి ఒక్కరూ ఆయన బాటలో నడవాలన్నారు. ఉస్మానియా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సయ్యద్ సమీరుద్దీన్ ముజమ్మిల్, డిఎస్‌పి బాబు ప్రసాద్, మహమ్మద్ బాష ఖాద్రీ తదితరులు మాట్లాడారు. అక్కడ ఉన్న అతిథుల చేత ఉమ్రా చేసేందుకు నలుగురు వ్యక్తులను విలాస్ కమిటీ ద్వారా పంపించేందుకు లాటరీ ద్వారా ఎంపిక చేశారు. తదుపరి దర్గా వద్ద జెండాను ఆవిష్కరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాజ్ విహార్ బస్టాండ్ పరిధిలో ఈ సందర్భంగా రక్తదానం చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేలు ఎస్‌వి. మోహన్ రెడ్డి, ఎంఎ. హఫీజ్ ఖాన్, వివిధ దర్గాల పీఠాధిపతులు ముస్లిం మత పెద్దలు ముస్లింలు హిందువులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



సందేశం ఇస్తున్న సయ్యద్ షఫీ పాషా ఖాద్రీ

పోరాటాల వేగుచుక్క ఎస్‌డబ్ల్యుఎఫ్

- 45వ వార్షికోత్సవ సభలో నేతలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆర్‌టిసి సంస్థలో పోరాటాల వేగుచుక్క ఎస్‌డబ్ల్యుఎఫ్ అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండిఅంజిబాబు, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రీజినల్ కార్యదర్శి విఎస్.రాయుడు అన్నారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ 45వ వార్షికోత్సవం సందర్భంగా కర్నూలు ఆర్‌టిసి బస్టాండు ఆవరణం లో జెండాను రీజినల్ కార్యదర్శి విఎస్.రాయుడు ఆవిష్కరించారు. అంజిబాబు, విఎస్ రాముడు మాట్లాడుతూ ఆర్‌టిసిలో ఎన్ని యూనియన్లు ఉన్నప్పటికీ కార్మికుల సమస్యల కోసం నిరంతరం పరితపించే సంఘం ఎస్‌డబ్ల్యుఎఫ్ అన్నారు. ఎల్లప్పుడూ పోరాటాలు చేస్తూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేసే ఏకైకసంఘమని అన్నారు. 1979 సెప్టెంబర్ 16న ఎస్‌డబ్ల్యుఎఫ్ ఏర్పడినప్పటి నుండి అనేక సందర్భాల్లో కీలకమైన పాత్ర పోషించిందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన దీర్ఘకాలిక సమ్మెను వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. సమ్మె సందర్భంగా ఎస్‌డబ్ల్యుఎఫ్ కీలకమైన పాత్ర పోషించిందని కొనియాడారు. ఇప్పటికీ ఆర్టీసీ సంస్థలో అనేక సమస్యలు ఉన్నాయని, సమస్యల పరిష్కారం కోసం యాజమా న్యం దృష్టికి నిరంతరం తీసుకొని వెళుతుందని తెలిపారు. ప్రభుత్వంలో విలీనం అయిన తర్వాత చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించి సెంట్రల్ బస్‌స్టేషన్ దగ్గర ధర్నా నిర్వహించిన ఏకైక సంఘం ఎస్‌డబ్ల్యుఎఫ్ మాత్రమేనని అన్నారు. 45 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో అనేక పోరాటాలు చేసిందని తెలిపారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ అభివృద్ధికి కార్మికులం దరూ కృషిచేసి సమస్యల పరిష్కారానికి పాటు పడాలని విజ్ఞప్తి చేశారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సీనియర్ నాయకులు శేఖర్, కర్నూలు -1 డిపో కార్యదర్శి నాగరాజు, కర్నూలు -2 డిపో కార్యదర్శి దేవరాజు, రీజనల్ కోశాధికారి రామకృష్ణా రెడ్డి, నాయుడు, నాగేంద్ర, ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు సీతారాం ఏచూరి సంస్మరణ సభ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభను సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యం లో మంగళవారం కర్నూలులో నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు సి.క్యాంప్‌లోని లలిత కళా సమితి (టిజివి కళాక్షేత్రం)లో సాయంత్రం 5 గంటలకు ఈ సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, లౌకిక, అభ్యుదయ వాదులు, కార్మికులు, కర్షకులు, ప్రజలు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.



కాంగ్రెస్ కార్యాలయంలో మిలాదున్ నబి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో సోమవారం మిలాదున్ నబీ వేడుకలు నిర్వహించారు. జిల్లా మైనార్టీ సెల్ మాజీ చైర్మన్ మహమ్మద్ నూర్ అధ్యక్షతన సిటీ మైనార్టీ సెల్ మాజీ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, సయ్యద్ ముర్షిద్ పీర్ ఖాద్రి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా డిసిసి అధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడారు. మాజీ మంత్రి మూలింటి మారెప్ప , మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు , ముస్లిం మత పెద్ద హజరత్ సయ్యద్ షా అబుల్ లతీఫ్, మొయినుద్దిన్ ఖాద్రి, కాంగ్రెస్ నాయకులు ఉండవెల్లి వెంకటన్న, దామోదరం రాధాకృష్ణ, బజారన్న, చంద్రశేఖర్, అనంతరత్నం, లాజరస్, పాల్గొన్నారు.



తైక్వాండో మాస్టర్ వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ

తైక్వాండో మాస్టర్ వెంకటేశ్వర్లుకు సన్మానం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

మానవత స్వచ్ఛంద సేవాసంస్థ, కర్నూలు నగర యూనిటీ ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీరామచంద్రారెడ్డితో తైక్వాండో మాస్టర్ వెంకటేశ్వర్లుకు ఘన సన్మానించారు. ఈ కార్యక్రమంలో మనోహర్ రెడ్డి, యుగంధర్ శెట్టి, యాని ప్రతాప్ పాల్గొని కర్నూల్ నగరంలో ఆత్మ రక్షణ కోసం అమ్మాయిలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్న తైక్వాండో మాస్టర్ టి వెంకటేశ్వర్లను ప్రత్యేకతగా అభినందించారు.

జ్యుడీషియల్ కమిషన్‌తో విచారణ చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ముంబై సినీ నటి జత్వాని కేసులో జ్యుడిషియల్ కమిషన్ ద్వారా విచారణ చేయాలని ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కె. బలరాం సోమవారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కేసులో సీనియర్ పోలీసు ఉన్నతాధికారులను సస్పెండ్ చేయడం సమస్యకు పరిష్కారం కాదన్నారు.

అస్తమించిన ఎర్ర సూర్యుడికి ఘన నివాళి

పజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అస్తమించిన ఎర్ర సూర్యుడు సీతారాం ఏచూరికి సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి ఘనంగా నివాళ్లు అర్పించారు. సోమవారం కర్నూలు సూర్జిత్ భవన్‌లో ఎస్‌డి.ఖాజాపాష అధ్యక్షతన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రెండవ వార్డు ఖల్ల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంతాప సభలో గౌస్ దేశాయ్ ,ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు, ఎస్‌ఏ.సుభాన్, సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు, ఎస్ఎండి.షరీఫ్ లు మాట్లాడారు. సీతారాం ఏచూరి మరణం ఈ దేశనికే కాక ,బడుగు ,బలహీన, వర్గాలతో పాటు ,మేధావి వర్గం కూడా తీవ్ర మనోవేదన లోనయిందని అన్నారు. ఆయన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ అనారోగ్యంతో చనిపోయాడన్నారు. ఇతర దేశాలలో రాజకీయ సంక్షోభం ఏర్పడినప్పుడు అది నేపాల్ ,వియత్నం ,క్యూబా ,తదితర దేశాలలో సీతారాం ఏచూరి పర్యటించి సంక్షోభాలను నివారించేవారన్నారు. ఆయన వాగ్దాటికి స్వపక్షాలతో పాటు విపక్షాలు చాలా శ్రద్ధగా వినేవని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి సవరణ పెట్టి ఓటింగ్‌లో ఏచూరి నెగ్గారన్నారు. మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు లలితకళా సమితిలో సి క్యాంప్‌లో ఏచూరి సంస్మరణ సభ ఉంటుందని, వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరు అవుతారని కాబట్టి అక్కడ జరిగే సభకు మీతో పాటు మీ బంధుమిత్రులను పిలుచుకొని రావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, ఎస్. ఏ. సుభాన్, ఎస్ ఎం డి షరీఫ్ లు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నగర నాయకులు ,మహబూబ్ బాషా ,షేక్షావలి ,నూర్ బాషా, మూసా మియా,గౌస్ బాషా,రసూల్ ,ఖలీల్ బాషా, రియాజ్ భాషా, షబ్బీర్ అహ్మద్ , జవీద్, తదితరులు పాల్గొన్నారు.




సీతారాం ఏచూరి సంతాప సభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి

కార్మిక, కష్టజీవుల ఆశాజ్యోతి సీతారాం ఏచూరి

కార్మికుల కష్టజీవుల ఆశాజ్యోతి సీతారాం ఏచూరి అని సిఐటియు నాయకులు సుధాకరప్ప, రామాంజనేయులు, యేసు అన్నారు. కర్నూలు నగరంలోని శరీన్‌నగర్ మట్టిపని అడ్డ దగ్గర భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సిఐటియు నగర నాయకులు ఏసు అధ్యక్షతన సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. జోహార్ సీతారాం ఏచూరికి, రెడ్ సెల్యూట్ అంటూ పెద్దఎత్తున నినాదాలుచేస్తూ ఘనంగా నివాళ్లు అర్పించారు. సిఐటియు భవన నిర్మాణ సంఘం నగర కార్యదర్శి ఆర్. నరసింహులు, నగర అధ్యక్షులు కె.సుధాకరప్ప సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల లేసి ఘనంగా నివాళులు అర్పించారు. రామాంజనేయులు, వెంకట్రాముడు, పి.శ్రీను అయ్యన్న ,శ్రీనివాసులు ,దాసు ,కిషోర్, శ్రీను, ఎంజె ఈశ్వరమ్మ, రమాదేవి, మరియమ్మ ,శాంతమ్మ, ఎం లక్ష్మి,సరోజమ్మ,ఎల్లమ్మ , మట్టిపని కార్మికులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి కి ఈ తాండ్రపాడు లో ఘన నివాళి

కర్నూలు క్రైమ్: సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి సోమవారం ఈ.తాండ్రపాడు గ్రామంలో గ్రామ ప్రజలు, పార్టీ కార్యకర్తలు ఘన నివాళిని అర్పించారు. సంతాప సభకు సర్పంచి బాలపీర అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ సీతారాం ఏచూరి జీవితాన్ని సర్వస్వం పార్టీ అభివృద్ధి కోసం దారపోశారన్నారు. తన చావులో సైతం సమాజానికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమన్నారు. సిపిఎం మండల కార్యదర్శి పిబి.హుస్సేనయ్య, పిఎండి హుస్సేన్, బి. రామానుజులు, తెలుగు వెంకట్ రాముడు, మునిస్వామి, పెద్దరంతుల, కె.తిరుమలేష్ తెలుగు సేసన్న, ఆర్.కాళిదాస్, మధు, బెస్త రేణుక, బి.నాగేశ్వరి, షఫీ, కాజా పీరా, వి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



శరీన్ నగర్‌లో ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లున్న అర్పిస్తున్న సుధాకరప్ప



ఈ తాండ్రపడాడులో ఏచూరికి నివాళ్లు అర్పిస్తున్న సర్పంచి బాలపీర, తదితరులు

స్వచ్ఛతా హీ సేవా'లో భాగస్వామ్యం కావాలి

- నేటి నుండి 15 రోజుల పాటు రోజుకో కార్యక్రమం
- అక్టోబర్ 2న స్వచ్ఛత దివస్ నిర్వహణ
- కలెక్టరేట్ నుండి రాజ్‌వీహార్ వరకు ర్యాలీ, మానవహారం
- నగరపాలక కమిషనర్ పివి. రామలింగేశ్వర్ వెల్లడి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్టోబర్ 2న 'స్వచ్ఛ భారత్ దివస్' కార్యక్రమాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో రేపటి నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు నగరంలో 'స్వచ్ఛతా హీ సేవా' పేరుతో రోజుకొక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పివి. రామలింగేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. తొలిరోజు మంగళవారం ఉదయం 07:30 గంటలకు, నగరపాలక అధికారులు, సిబ్బంది, సచివాలయాల కార్యదర్శులతో కలిసి కలెక్టరేట్ నుంచి రాజ్ వీహార్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అనంతరం అక్కడే మానవహారంగా ఏర్పడి, ప్రతిజ్ఞ చేయిస్తామన్నారు.

నిమజ్జనం విజయవంతం: గడిచిన రెండు వారాలుగా గణేష్ నిమజ్జన మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు రాత్రింబవళ్ళు శ్రమించిన నగరపాలక సంస్థ ఇంజనీర్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులకు, సిబ్బందికి, సచివాలయ కార్యదర్శులకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతున్నామని కమిషనర్ రామలింగేశ్వర్ తెలిపారు. పాత్రికేయ మిత్రుల సహకారానికి కూడా ప్రత్యేక కృతజ్ఞతలని అన్నారు.



టిడిపిలోనే బిసిల అభివృద్ధి

ఎంపి బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

తెలుగు దేశం పార్టీతోనే బిసిలకు అభివృద్ధి జరుగుతుందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. సోమవారం కర్నూలు నగరంలోని బిసి భవన్‌ను సందర్శించిన ఆయన నూతన బిసి భవన్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఎంపీ మాట్లాడుతూ గతంలో టిడిపి హయాంలో నూతనంగా బిసిభవన్ నిర్మాణం కోసం స్థలం కేటాయించడంతో పాటు రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత బిసి భవనం పూర్తిగా నిర్లక్ష్యం అయ్యిందన్నారు. ఇప్పుడు టిడిపి తిరిగి అధికారంలోకి వచ్చినందున బిసి భవన్ నిర్మాణంతో పాటు, పాత భవన మరమ్మతులకు తనవంతు సహాయం చేస్తానని ఎంపి నాగరాజు తెలిపారు. బిసి సంఘం నాయకులు నాగేశ్వరరావు యాదవ్, నక్కలమిట్ట శ్రీనివాసులు, మురళీమనోహర్, రామకృష్ణ , రాంబాబు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

బాధిత రైతులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కెవి.నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం కార్యాలయంలో మల్లేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో హంద్రీ పరివాహక ప్రాంతంలో రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా నష్టపోయారని తెలిపారు. అధికారులు తూతూమంత్రంగా సర్వేలు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. పత్తి పంట భారీ వర్షాల వల్ల ఎకరాకు రెండు క్వింటాళ్లు కూడా చేతికొచ్చే పరిస్థితి లేదన్నారు. ఎకరాకు రూ.30 వేలు పంట నష్టపరిహారం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతేడాది పప్పు శనగ పంట వేసి నష్టపోయిన రైతులకు ఇప్పటి వరకు నష్టపరిహారం జమ చేయలేదని పేర్కొన్నారు. కేంద్ర కరువు బృందం జిల్లా పర్యటన చేసి ఏమాత్రం రైతులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో పప్పు శనగ పంట వేసుకోవడానికి 70 శాతం సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు. రైతులను ఆదుకోకపోతే దశలవారీగా రైతుల సమీకరించి ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సిపిఎం మండల కార్యదర్శి హనుమంతు, మండల కార్యదర్శి వర్గసభ్యులు బాలకృష్ణ, మండల కమిటీ సభ్యులు రామాంజనేయులు, సుందర రాజు, యూసుఫ్, రామాంజనేయులు, మధు రెడ్డి, రవి పాల్గొన్నారు.

తరచూ వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలి

- మధు ఆస్పత్రి గుండె చికిత్స నిపుణులు విశ్వనాథ్

ప్రజాశక్తి - ఆదోని


శిబిరాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

వయస్సు నిమిత్తం లేకుండా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, తరచూ వైద్య పరీక్షలు నిర్వహించుకుని వ్యాధి తీవ్రత పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మధు ఆస్పత్రి గుండె చికిత్స నిపుణులు విశ్వనాథ్, ఆర్థోపెడిక్ దేవనగౌడ్, కంటి వైద్య నిపుణులు మానసి తెలిపారు. సోమవారం ఎస్‌టియు ఆధ్వర్యంలో మధు హాస్పిటల్స్ వారి సౌజన్యంతో ఆదోని మున్సిపల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి బి.నాగరాజు, డాక్టర్ విశ్వనాథ్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునలు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో గుండె, ఎముకలు, కంటి సంబంధిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. దాదాపు 150 మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు హాజరయ్యారు. మధు హాస్పిటల్స్ వైద్యులు ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి సంబంధిత వ్యాధులకు మందులు పంపిణీ చేశారు. మధు ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సదుపాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి బి.నాగరాజు, ఆదోని డివిజన్ నాయకులు వి.రమేష్ నాయుడు, రాష్ట్ర పురపాలక కమిటీ కన్వీనర్ జి.వీరచంద్ర యాదవ్, రాష్ట్ర కౌన్సిలర్ బి.మహదేవప్ప, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసి.సుంకన్న, మండల అధ్యక్ష, కార్యదర్శులు చింతకుంట రామకృష్ణ, బి.సుధాకర్ బాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి భీమరాజు, మధు ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ సునీల్ ఉన్నారు.

ఏచూరి ఆశయాలను సాధిస్తాం

- డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సీతారాం ఏచూరి ఆశయాలను సాధిద్దామని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ కోరారు. సోమవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో డివైఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థి ఉద్యమం నుంచి సిపిఎం ప్రధాన కార్యదర్శి వరకు ఆయన చాలా పోరాటాలు చేశారని తెలిపారు. ఎంపీగా దేశంలోని ప్రజల సమస్యలపై పార్లమెంటులో తను గళం వినిపించారని చెప్పారు. దేశంలో మతోన్మాద శక్తులను ఎదుర్కోవడంలో కమ్యూనిస్టు పార్టీలు, విద్యార్థి, యువజన, కార్మిక సంఘాలు ఏకం కావడానికి ముఖ్య పాత్ర పోషించారని తెలిపారు. ఏచూరిని ఆదర్శంగా తీసుకొని ప్రజలను చైతన్యం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మహేష్, సురేష్, నాయకులు అజిత్, రవి, రమేష్, అభిషేక్, సుశిరాజ్, కిరణ్ పాల్గొన్నారు.

పెద్దవంక చెరువు కట్టకు మరమ్మతులు

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలోని హెబ్బటం పెద్దవంక చెరువుకు మరమ్మతులు చేపట్టారు. చెరువులకు పడిన గుంతల విషయం వీరభద్ర గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా సోమవారం పనులు ప్రారంభించినట్లు డిఇ షఫీ తెలిపారు. టిడిపి నాయకులు సిహెచ్.విష్ణు రెడ్డి, వీరసేనా రెడ్డి, అయ్యలప్ప, వన్నూరప్ప, లక్ష్మయ్య, ఈరన్న, యంకప్ప, ఫక్కీరప్ప, నరసన్న పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల చేతివాటం

- డీజిల్ వినియోగంలో గోల్‌మాల్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపాలిటీలో డీజిల్ వినియోగంలో కొందరు కాంట్రాక్టు ఉద్యోగులు చేతివాటం ప్రదర్శిస్తూ మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నారని విమర్శలు ఉన్నాయి. తాగునీటి సరఫరాలో పైపులు పగలడం, లీక్ కావడం జరుగుతూనే ఉంటుంది. పారిశుధ్య విభాగంలో పట్టణంలో అక్కడక్కడ మురుగునీరు పారకుండా చెత్తాచెదారం కల్వర్టులకు అడ్డుగా ఉండడం, గుంతల్లో వర్షపునీరు నిలవడం వంటివి జరుగుతూనే ఉన్నాయి. వాటిని సరిచేసేందుకు ఆదోని మున్సిపాలిటీ పరిధిలో యంత్రాలు వినియోగిస్తున్నారు. ముఖ్యంగా జెసిబి ద్వారా అధికారులు అప్పుడప్పుడు పనులు చేయిస్తున్నారు. అవసరం మేరకే జెసిబి ద్వారా పనులు చేస్తున్నట్లు తెలిసింది. జెసిబి డ్రైవర్, ఆ పనులకు సంబంధించిన ఇన్‌ఛార్జీలు డీజిల్ వినియోగంలో అక్రమాలకు పాల్పడుతూ జేబులు నింపుకుంటున్నారని వినికిడి. ఇంజినీరింగ్, పారిశుధ్య విభాగం అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల ఈ అక్రమాలు జరుగుతున్నట్లు తెలిసింది. పని జరిగిన సమయాన్ని ఎక్కువ చూపి డీజిల్ బంక్ యజమానుల వద్ద బిల్లు తీసుకొని అక్కడ కూడా


ఆదోని మున్సిపల్ కార్యాలయం

అక్రమాలకు ఆజ్యం పోస్తున్నట్లు సమాచారం. నీటి సరఫరా పైపులైను పగిలినా, విరిగినా మరమ్మతులకు కావాల్సిన మెటీరియల్ సంబంధిత కాంట్రాక్టర్ ద్వారా తీసుకోవాలి. అక్కడ ఓ ఉద్యోగి కాంట్రాక్టర్ మెప్పు పొందేందుకు పాత సామాన్లు వినియోగించి అరకొర పనులు చేసి తమ వాటాగా కొంత మొత్తాన్ని తీసుకొని కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూరే విధంగా వ్యవహరిస్తున్నారని తెలిసింది. పనికి సంబంధించి ఎక్కువ బిల్లులు చూపిస్తున్నట్లు కూడా విమర్శలు ఉన్నాయి. నెలలో తరచూ జెసిబితో పనులు లేకున్నా అక్కడ పనులు చేశామని డీజిల్ వినియోగానికి సంబంధించిన బిల్లుల మంజూరులో కూడా అక్రమాలు జరుగుతున్నట్లు పలువురు చెబుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఆ ఉద్యోగులపై నిఘా ఉంచి డీజిల్ వినియోగంలో అక్రమాలు జరగకుండా చూడాలని పురవాసులు కోరుతున్నారు.

బాధితులను ఆదుకుందాం : ఆల్ఫ్రెడ్ రాజు

ప్రజాశక్తి - మంత్రాలయం

చేయి చేయి కలుపుదాం.. విజయవాడ వరద బాధితులను ఆదుకుంటామని మల్లెల గ్రూప్స్ అధినేత ఆల్ఫ్రెడ్ రాజు కోరారు. సోమవారం మండలంలోని సూగూరు గ్రామం నుంచి మల్లెల గ్రూప్స్ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సూగూరు గ్రామం నుంచి నాలుగు క్వింటాళ్ల బియ్యం, కొంత నగదు, నిత్యావసర సరుకులు అందజేసినట్లు తెలిపారు. సూగూరు గ్రామస్తులు గోపీనాథ్, ఇజ్రాయిల్, నాగరాజ్, హనుమన్న, సుజ్ఞానం, సురేష్, అంజినప్ప, సిద్ధప్ప పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న దాతలు

'గోవిందమ్మకు 'బార్' సహకరించాలి'

ప్రజాశక్తి - మంత్రాలయం

పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామంలో దళిత మహిళ గోవిందమ్మకు బార్ అసోసియేషన్ నుంచి సహకారం అందించాలని బిఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షులు రామతీర్థం అమ్రేష్ మాదిగ కోరారు. సోమవారం కర్నూలు నగరంలోని బార్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణమూర్తిని కలిసి జరిగిన సంఘటన వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గోవిందమ్మకు న్యాయవాదులు అండగా నిలవాలని కోరారు. సానుకూలంగా స్పందిస్తూ... ప్రతి న్యాయవాది తనవంతుగా బాధితురాలికి సహాయంగా ఉండాలని కోరారు. అడ్వకేట్ మోహన్, చార్లెస్, ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

నిందితులపై కేసు నమోదు చేయాలి

- మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్రప్రసాద్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దుశ్శాసన దురాక్రమణ రీతిలో మహిళను వివస్త్రను చేసిన నిందితులపై వివస్త్రన కేసు నమోదు చేయాలని మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం బాధితురాలు హరిజన గోవిందమ్మను ప్రభుత్వాస్పత్రిలో కోనేరు నాగేంద్ర ప్రసాద్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన గోవిందమ్మపై పాల్పడిన సంఘటన సిగ్గు చేటన్నారు. సంఘటన జరుగుతున్నప్పుడు పోలీసులు ఉన్నా ఏమీ చేయలేని పరిస్థితి ఉందని చెప్పారు. పోలీసులు అంత్యంత కష్టంతో కూడిన సంఘటనలో బాధితరాలిని కాపాడాల్సి వచ్చిందన్నారు. వందల మంది దాడికి కారకులైన కేవలం పది మందిపై మాత్రమే పోలీసులు కేసు నమోదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కులం పేరుతో దూషించిన కేసు నమోదు చేశారని తెలిపారు. మహిళలను వివస్త్రన చేసినట్లు ఫిర్యాదులో ఎఫ్ఐఆర్‌లో కనపరచకపోవడం వల్ల అనుమానాలకు దారితీస్తోందని తెలిపారు.



పరామర్శిస్తున్న కోనేరు నాగేంద్రప్రసాద్

గ్రామీణ విద్యార్థికి ఎంబిబిఎస్ సీటు

- ప్రభుత్వ, మోడల్ పాఠశాల నుంచి ఎంబిబిఎస్ సీటు వరకు - విద్యార్థిని విజయలక్ష్మి ప్రతిభా ప్రస్థానం

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఆమె ఓ మారుమూల గ్రామంలో సాధారణ పేద కుటుంబానికి చెందిన విద్యార్థిని. అందరిలాగే తను కూడా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యా ప్రస్థానాన్ని ప్రారంభించారు. 'పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది' అన్న చందంగా ఐదో తరగతి పూర్తి కాగానే తన ప్రతిభతో గోనెగండ్ల ఎపి మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశం పొందారు. అక్కడి ప్రిన్సిపల్ షాహినా పర్వీన్, ఉపాధ్యాయుల సహకారంతో తనలోని ప్రతిభకు మరింత మెరుగులు దిద్దుకున్నారు. 10వ తరగతి పరీక్షలో ఉత్తమ మార్కులు సాధించి అదే ఎపి మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ బైపిసి గ్రూపులో చేరారు. ఇంటర్ పరీక్షల్లో మరింత రెట్టించిన ఉత్సాహంతో కళాశాల టాపర్‌గా నిలిచారు. అదే ఏకాగ్రతతో ఏమాత్రం పట్టు సడలకుండా ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షల్లో మంచి ర్యాంకు సాధించి తన జీవిత లక్ష్యం, తల్లిదండ్రుల కల అయిన ఎంబిబిఎస్ సీటును సాధించారు. మండలంలోని ఎంతోమంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచారు. ఆ విద్యార్థిని గోనెగండ్ల మండలం పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన కె.విజయ లక్ష్మి.

గోనెగండ్ల మండలం నెరుడుప్పల గ్రామ పంచాయతీ పరిధిలోని పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన కురువ జనార్ధన్, లలిత దంపతులది సాధారణ కుటుంబం. జనార్ధన్ 21 ఏళ్ల కింద వెలుగు శాఖలో కాంట్రాక్టు ఉద్యోగిగా చేరారు. ప్రస్తుతం నందవరం మండలంలో వెలుగు(సిసి) క్లస్టర్ కోఆర్డినేటర్‌గా పని చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె కె.విజయలక్ష్మి అందరిలాగే పిల్లిగుండ్లలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు చదువుకున్నారు. తన ప్రతిభతో గోనెగండ్ల ఎపి మోడల్ పాఠశాలలో 6వ తరగతిలో సీటు సాధించారు. 2020వ సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో 588 అత్యధిక మార్కులు సాధించి అందరి మన్ననలు పొందారు. అదే మోడల్ జూనియర్ కళాశాలలో బైపిసిలో ఇంటర్మీడియట్‌లో చేరారు. 2022 ఇంటర్మీడియట్ పరీక్షల్లో 943 మార్కులు సాధించి మండలంలో టాపర్‌గా నిలిచారు. మే 5, 2024న ఎంబిబిఎస్ ప్రవేశాల కోసం నిర్వహించిన జాతీయస్థాయి నీట్-2024 ప్రవేశ పరీక్షలో 563/720 మార్కులు సాధించి మంచి ర్యాంకు పొందారు. ఈనెల 15న ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ వారు ప్రకటించిన ఎంబిబిఎస్ - 2024 ప్రవేశాల సీట్ల మొదటి విడత జాబితాలో చిత్తూరు జిల్లాలోని అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ కళాశాలలో సీటు సాధించారు. ఈమె చెల్లెలు కె.దివ్య ప్రియ కూడా ఇంటర్మీడియట్ ఎంపిసి గ్రూపులో అత్యధిక మార్కులు సాధించి ఇటీవలే జెఎన్‌టియు పులివెందులలో ఇంజినీరింగ్‌లో చేరారు. పిల్లిగుండ్ల లాంటి గ్రామీణ ప్రాంతంలో.. అందులోనూ బాలికల విద్యాశాతం అతి తక్కువగా ఉండే గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో చదివి ఇంటర్‌లో టాపర్‌గా నిలిచి విశేష కృషి, పట్టుదలతో నీట్ లో ర్యాంకు సాధించి ఎంబిబిఎస్ సీటు సాధించిన గ్రామీణ ఆణిముత్యం కె.విజయలక్ష్మిని గ్రామస్తులతో పాటు మండలంలో పలువురు, విద్యావంతులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపి ప్రశంసిస్తున్నారు.


కె.విజయలక్ష్మి

అవకాశమిస్తే ఏదైనా సాధిస్తారు..

- విద్యార్థి తండ్రి కె.జనార్ధన్, పిల్లిగుండ్ల గ్రామం



ఆడపిల్లలకు చదువు ఎందుకని అనుకోకుండా అవకాశం ఇచ్చి ప్రోత్సహిస్తే ఆడపిల్లలు కూడా ఏమైనా సాధిస్తారు. మాకు ఉన్నంతలో మా బిడ్డకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చదివించాం. ఆమె కృషి, పటుదలతో ఎంబిబిఎస్‌లో సీటు సాధించారు. వైద్య విద్యలో సీటు సాధించిన మొదటి వ్యక్తిగా నిలిచారు. డాక్టర్‌ను చేయాలనే మా కల నెరవేర్చినందుకు చాలా ఆనందంగా, గర్వంగా ఉంది.

పేద విద్యార్థికి ఎంబిబిఎస్ సీటు

ప్రజాశక్తి - హొళగుంద



మండలానికి చెందిన ఓ పేద విద్యార్థి ఎంబిబిఎస్ సీటు సాధించారు. మండలంలోని ఎల్లార్తి గ్రామానికి చెందిన మాల ఈరన్న, షేకమ్మ దంపతుల కుమార్తె రమ్యశ్రీ ఇటీవల జరిగిన నీట్ ఫలితాల్లో 536/720 మార్కులతో సీటు సాధించారు. తిరుపతి పద్మావతి మెడికల్ ఉమెన్ కళాశాలలో సీటు రావడం హర్షించదగ్గ విషయమని గ్రామస్తులు సోమవారం కొనియాడారు. రమ్యశ్రీ తండ్రి వృత్తిరీత్యా గొర్రెల కాపరి. వీరి తల్లి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రమ్యశ్రీకి సీటు రావడం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

తెర్నేకల్లులో హోమియోపతి ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని తెర్నేకల్లు గ్రామంలో సోమవారం హోమియోపతి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ యు.సోమశేఖర్, సర్పంచి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో మలేరియా, డెంగీ, చికున్ గున్యా వంటి వ్యాధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దాదాపు 200 మందికి ఉచిత హోమియోపతి మాత్రలు ఇచ్చారు. హోమియోపతి వైద్యులు నాగభూషణం, సగరం సంఘ అధ్యక్షులు గడ్డం నాగరాజు, ఎంపిటిసి నామాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION), ADONI.
E.P. 27/2020 IN O.S. 399/2018

Between:-
C.Narasanna. ...Decree Holder
Vs
B.Suryanarayana Reddy. ...Judgment Debtor

Sale Notice to Judgment Debtor-
B. Suryanarayana Reddy S/o B. Hanumantha Reddy aged about 45 years, Lecturer, resident of H.No.2/268/A, Thirumala Nagar, Adoni.

Whereas the above named Decree Holder filed an E.P. for recovery of E.P. amount of Rs. 7, 09, 411/- and the same is posted for your appearance if any on 26-09-2024.

You are hereby directed to appear in person or through your Advocate on 26-09-2024 at 10.30 a.m. before the above said Court to answer the said claim. Failing which the matter will be decided in your absence and made set ex parte.

G.C. RANGANNA,
G.RAJESH,
Advocates for Decree Holder.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION), ADONI
EP. 73/2022 IN O.S. 316/2018

Between-
Golla Ranganna. ...Decree Holder
Vs
B.Suryanarayana Reddy. ...Judgment Debtor

Sale Notice to Justament Debtor-
B. Suryanarayana Reddy S/o B Hanumantha Reddy aged about 45 years, Lecturer, resident of H.No.2/268/A, Thirumala Nagar, Adoni

Whereas the above named Decree Holder filed an E.P for recovery of E.P amount of Rs. 2, 97, 909/- and the same is posted for your appearance if any on 26-09-2024 You are hereby directed to appear in person or through your Advocate on 26-09-2024 at 10.30 am. before the above said Court to answer the said claim. Failing which the matter will be decided in your absence and made set ex parte

G.C.RANGANNA,
GRAJESH ,
Advocates for Decree Holder.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION): ADONI O.S.No.339/2018.

Between:
Syndicate Bank, Adoni Branch. ...Plaintiff.
Versus.
B.Musalalah and two others. ...Defendants.

To,
The Defendants
1.B.Musalaiah S/o.Rangappa, Hindu, aged about 55 years, resident of Chinna Harivanam Village, Adoni Mandal, Kurnool District.
2. Smt.B.Rangamma W/o.B.Musalaiah, Hindu, aged about 50 years, resident of Chinna Harivanam Village, Adoni Mandal, Kurnool District.
3. K.Veerasena Reddy S/o. Kesava Reddy, Hindu, aged about 50 years, Dhanapuram Village, Adoni Mandal, Kurnool District.

Whereas the above-named Plaintiff has filed the above suit against you for the claim mentioned in the plaint. You are hereby summoned to appear in the Court either in person or by a Pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some other person able to answer all such questions on 26- 09-2024 at 10-30 A.M in the forenoon, answer the claim and you are directed to produce on that day all the documents upon which you intend to rely in support of defense.. Take notice that in defaults of your appearance on the day before mentioned the suit will be heard and determined in your absence.

Date of Hearing: 26-09-2024.

Sd/- Sri P.Jaya Theertha,
Advocate for Plaintiff.
Adoni

17, 18న నవోదయలో క్లస్టర్ స్థాయి కళా ఉత్సవం

- నవోదయ ప్రిన్సిపల్ పద్మావతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరురూరల్

మండలంలోని బనవాసి శివారు ప్రాంతంలో ఉన్న జవహర్ నవోదయలో క్లస్టర్ స్థాయి కళా ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఇ.పద్మావతి తెలిపారు. సోమవారం నవోదయలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 16 నవోదయ విద్యాలయ విద్యార్థులకు 17, 18న బనవాసి నవోదయ విద్యాలయలో కళా ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 9వ తరగతి, 12వ తరగతి విద్యార్థుల మధ్య పోటీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనిలో ఒక విద్యార్థి, గరిష్టంగా ఐదుగురు విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. స్వర సంగీతం (క్లాసికల్, జానపదం, గిరిజన, భక్తిప్రపత్తులు), వాయిద్య సంగీతం (క్లాసికల్/పెర్కషన్ మెలోడిక్, ఆర్కెస్ట్రా సమిష్టి, జానపద/క్లాసికల్), నృత్యం (క్లాసికల్ : దేశంలోని ఏదైనా శాస్త్రీయ నృత్య రూపం, ప్రాంతీయ (జానపద/గిరిజన), సమకాలీన కొరియోగ్రఫీ (సినిమాయేతర), థియేటర్ (మోనో యాక్ట్, మిమిక్రీ, మైమ్, సమూహంలో ప్లే/డ్రామా), విజువల్ ఆర్ట్స్ (2 డైమెన్షనల్ (డ్రాయింగ్, పెయింటింగ్, ప్రింటింగ్, కార్టూన్, క్యారికేచర్), డైమెన్షనల్ (శిల్పం, మొబైల్‌లు), స్వదేశీ బొమ్మలు ఆటలు స్థానిక చేతిపనులు), సాంప్రదాయ కథ చెప్పడం : డ్యాన్స్, డ్రామా, సంగీతం లేదా విజువల్ ఆర్ట్స్ లేదా ఒకటి కంటే ఎక్కువ కళారూపాలను కలుపుకొని సాంప్రదాయక కథలు చెప్పడం ఉంటాయని తెలిపారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులు ప్రాంతీయ స్థాయి ఎంపిక జవహర్ నవోదయ విద్యాలయ కోజికోడ్ (కేరళ)లో జరుగుతుందని చెప్పారు.

తుంగభద్రపై వరద కాలువ నిర్మించాలి : రైతుసంఘం

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర నదిపై వరద కాలువ లేదా రైట్ కెనాల్ నిర్మించాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య కోరారు. సోమవారం టిడిపి మంత్రాలయం సీనియర్ నాయకులు చూడి ఉలిగయ్యతో కలిసి రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అతివృష్టి, అనావృష్టి వల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. తుంగభద్ర దిగువ కాలువ, మరోవైపు తుంగభద్ర నది ప్రవహిస్తున్నా రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదన్నారు. పంటలు పండక చిన్న, సన్నకారు రైతులు వలసలు వెళుతున్నారని తెలిపారు. తుంగభద్ర నది జలాలను ఉపయోగంలోకి తీసుకు రావాలంటే వరద కాలువ లేదా రైట్ కెనాల్ నిర్మించాలని కోరారు. టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య మాట్లాడుతూ... రైతు సంఘం తెలిపిన విషయాలను రాష్ట్ర పార్టీ దృష్టికి తీసుకెళ్లి తుంగభద్ర నదిపై వరద కాలువ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. రైతు సంఘం మండల కార్యదర్శి ఈరన్న, నాయకులు ఉలిగయ్య, తాయప్ప, వీరయ్య స్వామి, ఈరన్న, రంజాన్ సాబ్, వీరేష్, బసవరాజు, ఎల్లప్ప పాల్గొన్నారు.




వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మజీద్ అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని నదీచాగి గ్రామంలో జామియా మజీద్ అభివృద్ధికి సర్పంచి మహేష్ సోదరులు కబేరు, మారెప్ప రూ.2 లక్షల విరాళం అందజేశారు. సోమవారం ఆయన మాట్లాడారు. సర్పంచి ఎన్నికల ముందు హామీ మేరకు మజీద్ అభివృద్ధికి ముస్లిం పెద్దలు ఖాసీం వలీ, నజూర్, మౌలా సాబ్, హుస్సేన్ బాష, అలీకి విరాళం అందజేశారని తెలిపారు. వడ్డే గోవిందు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న నాయకులు

గూడ్స్ రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - కోసిగి

కోసిగి రైల్వే గేటు సమీపంలో కోసిగి నుంచి ఐరనగల్ 523/40-42 కిలోమీటర్ వద్ద కోసిగి గ్రామానికి చెందిన బలకుంద కోసిగయ్య (52) సోమవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యులు, రైల్వే పోలీసుల వివరాల మేరకు... కోసిగయ్య మద్యానికి బానిసై, కుటుంబ కలహాలతో గూడ్స్ రైలు కింద తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జిఆర్‌పి పోలీసులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా సోమవారం పట్టణంలోని ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అన్ని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జామియా మసీదు నుంచి ముస్లింలు జెండా చేతపట్టి ప్రదర్శనలు చేపట్టారు. జామియా మసీదు నుంచి ఖునీ పంజా మైదానం, సున్నం బట్టి మసీద్, గోనెగండ్ల రోడ్డు, ఆఫీస్ మసీద్, గాంధీ సర్కిల్, సోమప్ప సర్కిల్ మీదుగా తిరిగి జామియా మసీదు వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు ఖాసీం బేగ్, మహబూబ్ జిలానీ, సాబీర్, బందే నవాజ్, తురేగల్ నజీర్ అహ్మద్, రసూల్, వహీద్, మహబూబ్, రహీమ్ మాట్లాడారు. మహ్మద్ ప్రవక్త బోధన, ఆయన చూపిన మార్గం, దాతృత్వం, కరుణ, ధార్మిక చింతన, సర్వ మానవ మానవత్వం, ఐక్యమత భావన మానవాళికి అనుసరణీయమని పేర్కొన్నారు. **ఆదోని** పట్టణం, మండలంలోని ఆయా గ్రామాల్లో మిలాద్ ఉన్ నబీ వేడుకలు నిర్వహించుకున్నారు. ఉదయం నుంచి పట్టణంలోని ప్రతి మసీదులోనూ ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్రను వివరించి, ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మార్గంలో నడవాలని సూచించారు. అనంతరం ఆయా వార్డుల్లో దాతలు నిర్వహించిన అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో ఉన్న రోగులకు పండ్లు పంచారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో నిర్మల్ టాకీస్ సమీపంలో హటేలి లైన్‌లో ఏర్పాటు చేసిన మహ్మద్ ప్రవక్త దుస్తులు, తలనీలాలు, మూవీ ముబారక్ దర్శనం కోసం వందలాదిమంది తరలివచ్చారు. పట్టణంలోని బడే ఆసర్‌ను ప్రభుత్వం గుర్తించిందని, ఇప్పటివరకు అధికారికంగా బడే ఆసర్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సయ్యద్ మహబూబ్ బాషా తెలిపారు. పట్టణంలోని కాజీపుర, అవన్నపేట, ఖూనీ మొహల్లా, సయ్యద్ పేట్, ఫరీస్సా మొహల్లా, కౌడల్‌పేట్ ఇతర ప్రాంతాల్లో జూలూసు కార్యక్రమాలు జెండాలతో నిర్వహించారు. **దేవనకొండ**లో ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలు నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన రహదారుల వెంట ర్యాలీ నిర్వహించారు. మసీదులోనూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లింలు బంధుమిత్రులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. **గోనెగండ్ల**లో ముస్లింలకు అత్యంత పవిత్రమైన మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణాలు, పల్లెల్లోని మసీదులు సుందరంగా ముస్తాబు చేసి నమాజులు చేశారు. నూతన దుస్తులు ధరించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గోనెగండ్ల మెయిన్ బజార్ పెద్ద మసీదు నుంచి ర్యాలీగా నూతనంగా నిర్మించిన మక్కా మసీదు వరకు జులుస్‌తో ర్యాలీ నిర్వహించారు. నిరాశ్రయులకు, వృద్ధులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. **చిప్పగిరి**లో ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆప్షన్ సభ్యులు సర్వర్‌ఖాన్ మాట్లాడారు. మహ్మద్ ప్రవక్త చూపిన ప్రవచనాలు ప్రతి ఒక్కరూ ప్రేమ, కరుణ, సహనం, శాంతితో కలిగి జీవించాలని ఆకాంక్షించారని తెలిపారు. చిప్పగిరితో పాటు అనేక గ్రామాల్లో ఈ వేడుకలను ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని ఘనంగా నిర్వహించారు. **మంత్రాలయం** జామీయ మసీదు నుంచి రాఘవేంద్ర సర్కిల్ మీదుగా ఈద్గా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడి నుండి మసీదు చేరుకుని తలనీలాల ప్రదర్శన చేపట్టారు. ఇమాం ఖాజా బందేనవాజ్ మాట్లాడుతూ... మహ్మద్ ప్రవక్త అడుగుజాడల్లో నడవాలని సూచించారు. జామియ మసీదు కమిటీ పెద్దలు, యూత్ కమిటీ సభ్యులు సాబువలీ, అండే బాష, అక్బర్ వలీ, చాంద్ బాష, రఫిక్, గని, గన్షిద్, ఖాజా ఉన్నారు. అలాగే మాధవరం మసీదు నుంచి గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. వగరూరులో ఉమ్మీద్ మైనార్టీ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రిలో రోగులకు, అనాథలకు భోజనాలు పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా సిఐ రామాంజులు ఆధ్వర్యంలో మంత్రాలయం ఎస్ఐ పరమేష్ నాయక్, మాధవరం ఎస్ఐ విజయ్ కుమార్ బందోబస్తు నిర్వహించారు. **ఆస్పరి** మండలంలోని మసీదుల్లో నమాజ్‌లు నిర్వహించి, అనంతరం మహ్మద్ ప్రవక్త జీవితం గురించి, ఇస్లాం గురించి మతపెద్దలు వివరించారు. ఆస్పరిలో ర్యాలీగా వెళ్లి ఊరేగింపు (జులూస్) నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ముస్లిం మత పెద్దలు, యువకులు ఖాదర్ బాషా, జంసూర్, ఖలీల్, ముస్తాక్, ఇస్మాయిల్, గఫూర్, వలీబాష, రఫీ, మైబు పాల్గొన్నారు. **కౌతాళం**లోని జామియా మసీదు నుంచి పురవీధుల్లో మక్కా మదీనా ప్రతిమలకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గాలో మహ్మద్ ప్రవక్త అసర్ ఏ ముబారక్ దర్గా ఏర్పాటు చేసిన ప్రతిమ, మక్కా మదీనా ప్రతిమ, ప్రవక్త తలనీలాలు గ్రామ ప్రజలు సందర్శించారు. శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి పీఠాధిపతులు మున్నా పాషా, గ్రామ ప్రముఖులు మహ్మద్ ధనిఫ్, ఖురేషి మహబూబ్, సయ్యద్ దూద్ బాషా, ఇద్రూస్ పాల్గొన్నారు.


ఎమ్మిగనూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు




కౌతాళంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు